క్లుప్తంగా

వసతి గృహంలో సీసీ కెమెరాల ఏర్పాటు



వసతి గృహ విద్యార్థినులకు యాప్‌ను డౌన్లోడ్ చేసి అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పాయకరావుపేట: పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సీఐ జి.అప్పన్న తెలిపారు. శక్తి బీట్‌తో బీసీ బాలికల వసతి గృహంను మంగళవారం ఆమె పరిశీలించారు. వసతి గృహం సెక్యూరిటీ దృష్ట్యా నాలుగు హై క్వాలిటీ సీసీ కెమెరాలను వసతి గృహానికి నలువైపులా ఏర్పాటు చేశామన్నారు. వసతి గృహం విద్యార్థులతో శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేయించి యాప్ వినియోగంపై సీఐ అవగాహన కల్పించారు.

ఉపాధ్యాయ వృత్తి గొప్పది



శ్రీజోష్ దంపతులను సత్కరిస్తున్న హోం మంత్రి అనిత

కోటవురట్ల: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని, ఎందరికో మార్గదర్శకంగా నిలిచి ఎంఈవోగా పదవీ విరమణ పొందిన శ్రీజోష్ అభినందనీయులని హోం మంత్రి అనిత ప్రశంసించారు. స్థానిక కేకేబీ చర్చిలో ఎంఈవో-2 శ్రీజోష్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హోం మంత్రి అనిత.. శ్రీజోష్ దంపతులను సత్కరించారు. విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

సమయ పాలన తప్పనిసరి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న డీఈవో అప్పారావునాయుడు

కోటవురట్ల: ఉపాధ్యాయులు సమయ పాలన పాటించకపోతే చర్యలు తప్పవని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పరిసరాలు, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత ఉండేలా పర్యవేక్షించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బోధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్‌చార్జ్ హెచ్ఎం సుకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునగపాకలో వాహన తనిఖీలు



మునగపాక మెయిన్‌రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మునగపాక: ప్రతి ఒక్కరూ వాహన రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని ఏఎస్ఐలు దొర, రామకృష్ణ కోరారు. మంగళవారం సాయంత్రం వారు మునగపాక మెయిన్‌రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



రాంబిల్లిలో నినాదాలు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రాంబిల్లి(అచ్యుతాపురం): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. రాంబిల్లిలో మంగళవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల నుంచి వసూలు చేస్తున్న సెస్సు సొమ్మును ఆయా కార్మికుల సంక్షేమానికే వెచ్చించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ వెనక్కి తీసుకోవాలన్నారు. ఈనెల 9వ తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు దేవుడు నాయుడు, చందక రామకృష్ణ, శిరం రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.



వరండా గచ్చులు గోతులు పడిన దృశ్యం



పెదబోదిగల్లం పాఠశాల భవనం శ్లాబ్ పెచ్చులురాలిపడుతున్న దృశ్యం

క్షణ క్షణం.. భయం.. భయం

- కూలడానికి సిద్ధంగా ఉన్న పెదబోదిగల్లం పాఠశాల భవనం
- ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ శిథిల భవనాల్లోనే చదువులు
- వర్షం పడితే విద్యార్థుల గైర్హాజరు



పాక్షికంగా దెబ్బతిన్న గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ముస్లిం గ్రామాల విద్యార్థులతో ప్రభుత్వం చెలగాటమాడుతోంది. మండలంలోని ముస్లిం గ్రామమైన పెదబోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అక్కడక్కడ శ్లాబ్ పెచ్చులు రాలిపడుతున్నాయి. కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలను చూసి తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపడానికి భయపడుతున్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పిల్లలు చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

మండలంలోని ముస్లింల కోసం పెదబోదిగల్లం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేశారు. ముస్లింలతో పాటు, ఇతర సామాజిక వర్గాల వారు కూడా ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. పెదదొడ్డిగల్లు, పెదబోదిగల్లం, చినబోదిగల్లం, అప్పలపాయకరావుపేట, రామకృష్ణాపురం గ్రామాల విద్యార్థులు సుమారు 80 మంది ఆరు నుంచి 8వ తరగతి వరకు ఇక్కడ చదువుతున్నారు. ఈ పాఠశాలలో మొత్తం ఆరు గదులకు నాలుగు పూర్తిగా దెబ్బతిన్నాయి. రెండు గదులు పాక్షికంగా పాడైపోయాయి. పూర్తిగా దెబ్బతిన్న 4 గదుల్లో శ్లాబ్ పెచ్చులు పెద్దపెద్దవి ఊడిపడుతున్నాయి. పాక్షికంగా పాడైన గదుల్లో కూడా ఇదే పరిస్థితి.

పాఠశాల వరండా గచ్చు అంతా పగిలిపోయింది. పెద్ద పెద్ద గోతులు పడింది. ఈ ఆరు గదుల్లో తరగతుల నిర్వహణ సాధ్యం కాకపోవడంతో ఉపాధ్యాయులు విద్యార్థులను పాఠశాల పక్కనే ఉన్న రెండు రేకుల షెడ్లలో కూర్చోబెట్టి బోధన చేస్తున్నారు. వర్షం పడితే ఈ షెడ్లలోకి కూడా వర్షపు నీరు, జల్లులు రావడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. షెడ్లలో రెండు తరగతులను ఉంచి బోధన చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పాఠశాల భవనాలు ఎప్పుడు ఏ క్షణంలో కూలుతాయోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

తల్లిదండ్రుల నిరసన

ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్చాలని గ్రామాల్లో ప్రచారం చేయడానికి వెళ్లిన ఉపాధ్యాయులకు తల్లిదండ్రుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. పాఠశాలలో భవనాలు కూలడానికి సిద్ధంగా ఉండడంతో తమ పిల్లలను ఎలా పంపిస్తామంటూ ప్రశ్నిస్తున్నారు. ముందు సరైన భవనాలను నిర్మించి అప్పుడు ప్రచారం చేయాలని సమాధానం రావడంతో ఏం చేయాలో తోచక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ఇక్కడ ఒక గెజిటెడ్ హెచ్ఎం, తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, పీఎస్, ఎన్ఎస్ సబ్జెక్టులు బోధించేందుకు సరిపడా ఉపాధ్యాయులు ఉన్నారు. కానీ సరైన భవనాలు లేకపోవడంతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. వర్షం పడితే పిల్లలు పాఠశాలకు రావడం లేదు. శ్లాబ్ పెచ్చులు రాలిపడుతుండడంతో తరగతి గదుల్లోకి విద్యార్థులెవరూ వెళ్లకుండా ఉపాధ్యాయులు రక్షణ చర్యలు చేపట్టారు. పాఠశాల భవనాల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులు పట్టించుకోవడం లేదు..



మా గ్రామంలో పాఠశాల కూలడానికి సిద్ధంగా ఉంది. శ్లాబ్ పెచ్చులు రాలిపడుతున్నాయి. ఎక్కువగా ముస్లిం పిల్లలే ఇక్కడ చదువుకుంటారు. చాలా రోజుల నుంచి ఇలాగే ఉంది. అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. ఇలా అయితే పిల్లల్ని ఎలా పంపిస్తాం.

– షేక్ మహబూబున్నిషా, పేరెంట్, బోదిగల్లం

పిల్లల భవితపై భయమేస్తోంది..



పాఠశాలకు పిల్లల్ని పంపాలంటే భయంగా ఉంది. ఒక పక్క పైనుంచి పెచ్చులు రాలిపడుతుంటే పక్కనే పిల్లల్ని కూర్చోబెట్టి చదువు చెబుతున్నారు. గతంలో మేమంతా వెళ్లి నిలదీస్తే పక్కనే ఉన్న షెడ్లోకి మార్చారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాలకు పిల్లల్ని పంపడం ఇష్టం లేదు. అలా అని మానేస్తే మా పిల్లల భవిష్యత్ ఏమవుతుంది. అధికారులు ఆలోచించాలి కదా.

– వై.వరలక్ష్మి, విద్యార్థి తల్లి, బోదిగల్లం

ఏదైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత



గతేడాది నుంచి పాఠశాల రోజురోజుకు ఎక్కడో ఒక చోట పెచ్చులూడిపోతూనే ఉంది. అధికారులు వస్తున్నారు, చూస్తున్నారు తప్ప పట్టించుకోవడం లేదు. మా పిల్లల ప్రాణాలంటే ఎందుకు అంత లోకువ. జరగరానికి ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. ఇంత దారుణమా, కనీసం మరమ్మతులు కూడా చేయించడం లేదు. విద్యార్థులు తక్కువగా ఉన్నారని కొత్త భవనాలకు నిధులు మంజూరు చేయడం లేదని తెలిసింది. ఇదెక్కడి న్యాయం. ఏదైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలి.

– సత్యవతి, పేరెంట్, బోదిగల్లం

తహసీల్దార్ గారూ.. బాధ్యతలు చేపట్టరూ!



మునగపాక తహసీల్దార్ కార్యాలయం

మునగపాక: మునగపాక మండల రెవెన్యూ కార్యాలయానికి తహసీల్దార్‌గా నియామకమైన ఆనంద్ ఇంత వరకు బాధ్యతలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ అధికారుల బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు తహసీల్దార్‌గా సేవలందించిన ఆదిమహేశ్వరరావు పాయకరావుపేటకు బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో పెందుర్తి తహసీల్దార్‌గా పనిచేసిన ఆనంద్‌ను మునగపాకకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. బదిలీలు జరిగి రోజులు గడుస్తున్నా ఆయన బాధ్యతలు చేపట్టకపోవడంతో పలు పనులపై వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైతు సమస్యలతో పాటు పలు ధ్రువీకరణ పత్రాలు అవసరం కోసం వచ్చే వారు సైతం అవస్థలు పడుతున్నారు. మునగపాకలో ఉద్యోగం అంటే కొంత మంది అధికారులు భయపడుతున్నారు. పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి బాధితులకు ఇచ్చే పరిహారం నేరుగా నగదు కాకుండా టీడీఆర్ బాండ్లు ఇచ్చేలా అధికారులు అవగాహన కల్పించడంతో పాటు శతశాతం బాధితులను ఒప్పించే బాధ్యత తహసీల్దార్‌పై ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో అటువంటి సాహసం చేయాల్సి ఉన్నందున నూతనంగా నియమితులైన తహసీల్దార్ ఆనంద్ ఇక్కడకు వచ్చేందుకు సుముఖంగా లేరేమోనన్న అనుమానం స్థానికుల్లో నెలకొంది. లేకుంటే మంచి ముహూర్తం దొరకక బాధ్యతలు చేపట్ట లేదో తెలియాల్సి ఉంది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాయకరావుపేట: మండలంలోని పాల్మన్‌పేట, కొర్లయ్యపేట, రాజయ్యపేట, కుమారపురం, రాజగోపాలపురం, కందిపూడి గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఈఈ రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అధినేతతో ఆత్మీయ కలయిక



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన చిక్కాల రామారావు

యలమంచిలి రూరల్/పాయకరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, పార్టీ పాయకరావుపేట మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయా నియోజకవర్గాల్లో తాజా రాజకీయ పరిస్థితి, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల గురించి అధినేతకు వారు వివరించారు.

నూకాంబిక అమ్మవారి ఆలయ ఆర్చి ప్రారంభం




నూకాంబిక అమ్మవారి ఆలయ ఆర్చి ప్రారంభిస్తున్న భక్తులు



ఆలయ ముఖ ద్వారం వద్ద నిర్మించిన ఆర్చి

ఎస్.రాయవరం: గుర్రాజుపేటలోని నూకాంబిక అమ్మవారి ఆలయ ముఖ ద్వారం వద్ద నిర్మించిన ఆర్చిని మంగళవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన సాగి వెంకటసత్యనారాయణరాజు సహాయం ఈ ఆర్చిను నిర్మించారు. సుమారు రూ.3.50 లక్షలతో నిర్మించిన ఈ ఆర్చి ఆలయానికి ప్రత్యేక అందాన్ని తీసుకొచ్చిందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువర్మ, రాముఠాజు, కొర్ని శ్రీనివాస్, చంటి రాజు, తదితరులు పాల్గొన్నారు.

‘హామీలపై టీడీపీ నాయకులను నిలదీయండి’



వీసం రామకృష్ణ

నక్కపల్లి: గడపగడపకు తెలుగు దేశం పేరుతో బుధవారం నుంచి గ్రామాల్లో పర్యటనకు వస్తున్న టీడీపీ నాయకులను ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై నిలదీయాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ హామీలిచ్చారని, అన్నదాత సుఖీభవ ఇంత వరకు ఇవ్వలేదన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతికి అతీగతీ లేదన్నారు. నక్కపల్లి మండలంలో కంపెనీల కోసం భూసేకరణ ప్రధాన సమస్యగా ఉందన్నారు. గతంలో భూములు సేకరించే సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్ట పరిహారం చెల్లించలేదని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. నిర్వాసితులకు ఇంతవరకు పునరావాసం కల్పించలేదన్నారు. దీనికి తోడు స్టీల్‌ప్లాంట్ కోసం అదనంగా 3,265 ఎకరాలు భూములు సేకరిస్తున్నారన్నారు. ఇప్పటికే బల్క్ డ్రగ్‌పార్క్‌కు కేటాయించిన 2 వేల ఎకరాలకు అదనంగా మరో వెయ్యి ఎకరాలు కేటాయిస్తున్నారని ధ్వజమెత్తారు. దీంతో రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించడం లేదన్నారు. కంపెనీల కోసం బలవంతంగా భూములు లాక్కుంటే అధికారులను చెట్లకు కట్టి కొట్టాలని గతంలో చంద్రబాబు పిలుపునిచ్చారని, ఇప్పుడు అదే చంద్రబాబు రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారం వచ్చిన తర్వాత మరోలా టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారన్న విషయం ప్రజలు, రైతులు గుర్తించి నిలదీయాలన్నారు. పంట భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు కంపెనీలకు విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వీసం విమర్శించారు. దీన్ని ప్రజలు గ్రహించాలన్నారు.

వామనావతరంలో జగన్నాథుడు



వామనావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

మునగపాక: మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో మంగళవారం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు మంగళవారం వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథ నవరాత్రి ఉత్సవాల్లో ఆయా గ్రామాల్లో భక్తులు జగన్నాథున్ని దర్శించుకునేందుకు తరలివచ్చారు. కాగా ఈ నెల 6న పండగను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

అచ్యుతాపురం తహసీల్దార్‌గా సత్యనారాయణ



అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం మండల తహసీల్దార్‌గా జి.సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గతంలో పాయకరావుపేటలో విధులు నిర్వహించినట్లు తెలిపారు. సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.


చిరుధాన్యాల సాగుపై ఆసక్తి అవసరం



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సుమంత

(రాంబిల్లి)అచ్యుతాపురం: చిరు ధాన్యాల సాగుకు రైతులు ఆసక్తి చూపించాలని రాంబిల్లి మండల వ్యవసాయాధికారి సుమంత కోరారు. రాంబిల్లి మండలంలోని పంచదార్ల, దిమిలి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె రైతులతో మాట్లాడారు. రాగి, సజ్జలు, జొన్న, కొర్ర పంటలు సాగు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జీవామృతం, కషాయాల తయారీ గురించి అవగాహన కల్పించారు. పీఎండీఎస్ కిట్‌ల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ శిరీష, వీఏఏలు సరోజిని, మేఘన, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో అవస్థలు



అధ్వానంగా ఉన్న రేవుపోలవరం రోడ్డు

ఎస్.రాయవరం: మండలంలో మంగళవారం ఉదయం నుంచి వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కూలీలకు ఆటకం కలగడమే కాకుండా రైతులు నారుమడులు తయారు చేసుకునేందుకు ఇబ్బంది పడ్డారు. వర్షపు నీరు దిగువకు పోయే మార్గం లేక రోడ్లు చెరువుల్లా దర్శనమిచ్చాయి. రేవుపోలవరం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు, సైతారుపేట నుంచి ఎస్.రాయవరం వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. గోతుల్లో నీరు చేరడంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ జ్యోతీశ్వరరావు

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సహకార సంఘ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జ్యోతీశ్వరరావు కోరారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా మండలంలోని నాగులాపల్లి పీఏసీఎస్ పరిధిలోని తోటాడలోని బహుళ ప్రయోజక సేవా కేంద్రం ఆవరణలో మంగళవారం ఆయన మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘ పరిధిలోని రైతులకు మెరుగైన సేవలందించాలన్నారు. రైతులు కూడా సంఘ అభివృద్ధికి సహకరించాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. సంఘ సీఈవో మళ్ల స్వామి, అనకాపల్లి ఆవ కాలువ సంఘ చైర్మన్ ఆడారి సన్యాసినాయుడు, జేకే నాయుడు, దొడ్డి రమేష్, కోరిబిల్లి వెంకట్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

మునగపాక: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి కోరారు. మండలంలోని నాగులాపల్లి పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులతో సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ప్రధానమంత్రి జీవన జ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసు కోవాలన్నారు. మహిళలు పురుషులతో సమానంగా ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. తక్కువ ప్రీమియంతో మెరుగైన బీమా సదుపాయం పొందాలన్నారు. వెలుగు ఏపీఎం బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎల్‌డీఎం సత్యనారాయణ, బీఎం శ్రవణ్, సీసీ రామకృష్ణ, వీవోఏలు కమల, నీలిమ, హేమ, జానకి, తదితరులు పాల్గొన్నారు.

గంగాలమ్మతల్లి గుడికి విరాళం

మునగపాక: మండలంలోని పాటిపల్లి-మంధళవరపుపేట గ్రామాల పరిధిలో గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వాములవుతున్నారు. దీనిలో భాగంగా మంగళవరపుపేటకు చెందిన రాపేటి సత్యనారాయణ, మాణిక్యం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు రామకృష్ణ సోమవారం రాత్రి తనవంతు సాయంగా రూ.10,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న భక్తులు



స్కూల్ బస్సులను తనిఖీలు చేస్తున్న ఆర్టీవో అధికారులు

స్కూల్ బస్సుల తనిఖీ

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం కూడలిలో మంగళవారం ఆర్టీవో అధికారులు స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. వాహనాల ఫిట్‌నెస్, డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ తదితర పత్రాలపై ఆరా తీశారు. వేగ నియంత్రణ పాటించాలని సూచించారు.

విత్తన శుద్ధితో చీడపీడల నివారణ

యలమంచిలి రూరల్: పంటల సస్యరక్షణలో విత్తన శుద్ధి మేలైన ప్రక్రియ అని యలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.జాహ్నవి అన్నారు. మంగళవారం మండలంలోని పులపర్తి సచివాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. విత్తన శుద్ధితో తొలిదశలో ఆశించే పురుగులు ,తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చని, భూమిని దున్నడం ఎంత ముఖ్యమో శుద్ధి చేసిన విత్తనాన్ని వాడటం కూడా అంతే ప్రధామని ఆమె సూచించారు.

పాయకరావుపేట: మండలంలోని పెదరాంభద్రపురం , గుంటపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా క్షేత్ర సందర్శన అనంతరం రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ వరి నారుమడి, పంట నమోదుపై అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ నేలలు స్వభావం, మట్టి నమూనాల ప్రాముఖ్యత, ఎరువుల యాజమాన్యం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో నాగమణి, వీఏఏ వందన, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

24 మద్యం బాటిళ్ల స్వాధీనం

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని లాలం కోడూరు శివారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూ. 8,520 విలువైన 24 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జంగాలపాలెం జంక్షన్‌లోని వైన్ షాప్ నుంచి కొనుగోలు చేసిన మద్యాన్ని లాలం కోడూరు శివారులో విక్రయిస్తున్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు.